# ముసలెద్దు

రాఘవయ్య కాపు కమతం పాలెం మొత్తానికే పెదకమతం. నూటపదెకరాల మాగాణీ, పదెకరాల గరువు గల పెద్దరైతు అతనొక్కడే వుంది ఆ వూళ్ళో.

ఆవులు, గేదెలు, ఎడ్లజతలు ఇంట పుట్టిన లేగదూడలు ఆ వందా పదెకరాల చేనులోనూ, కాలారినంత మేరా తిరిగి సాయంత్రం ఆయ్యే సరికి పదెకరాల గరువుమీద కట్రాటులకి కట్టేసినప్పుడు 'పశువుల సంత' అనిపిస్తుంది.

—నిజానికి చేలనుగానీ పశువుల్నిగానీ పాతికేళ్ళనించి స్వయముగా చూడ్డం మానేశాడు రాఘవయ్య. మిలట్రీనించి పారిపోయొచ్చిన నర్సిగాడు తనపంచన చేరగానే రాఘవయ్యకి కొండంత ఆసరా దొరికింది.

నర్సిగాడు 'ఎక్కడ తనని పట్టుకొని మళ్ళీ మిలట్రీలోకి తీసుకపోయి ఏంచేస్తారో అన్న భయంతో రాఘవయ్య కమతంలో అడుగు పెట్టిన తర్వాత అక్కడి పశువుల్లో ఓ పశువులా, అక్కడ పెరిగిన మాకుల్లో ఓ మాకులా, ఆ చేల నంటిపెట్టుకొని బ్రతకడం మొదలు పెట్టాడు.

ముప్పై ఏళ్ళున్నా పైబడని నర్సిగాడు తన ప్రాణంపైన తీపికొద్ది తను మనిషినే అన్న సంగతి మరచిపోయి మనిషి కుండవలసిన కోరిక

లని తవ్విపాతేసి నోరులేని పశువులా, కోరికలున్నా చెప్పలేని మూకు లాగా నాలుగేళ్ళు రాఘవయ్య నీడన బ్రతికేడు.

రాఘవయ్యకి నర్శిగాడిపైన నమ్మకం కుదిరింది. ఎంత జీతమిచ్చి పెట్టుకొన్నా రాత్రింబవళ్ళు పొలాన్ని అంటిపెట్టుకొని పనిచేసే నర్శిగాడి లాంటి మనిషి దొరకడని గ్రహించి రాఘవయ్య ఆదుకొన్నాడు. వాడి గురించొచ్చిన పోలీసు ఆరాలను వాడివరకూ రానీకుండా పొలిమేరనించే వెనక్కి సాగనంపేడు. చివరికి పోలీసు రికార్డుల్లో మిలట్రీనుంచి పరారైన సోల్జర్ నర్సయ్య చచ్చిపోయినట్టు నమోదు అయింది. నర్శిగాడుగా రాఘవయ్య కమతంలో కలిసేడు. ఈ నిజం తెలీని నర్శిగాడు అనునిత్యం తనని వెంటాడే ప్రాణభీతితో బతికినంతకాలం బ్రతకడం తప్ప మరే కోరికా పెట్టుకోకుండా రాఘవయ్య కమతం కోసమే పుట్టినట్టు అరవై ఏళ్ళవాడయ్యాడు.

నర్శిగాడికి నడుం వంగింది.

తల నెరిసింది.

చెయ్యిచాటుతోగానీ దూరంగావున్న మనిషిని చూళ్ళేడు. అయినా నా బొందో అని కుడితిలో పడ్డ ఎలకలా ఆ కమతాన్నంతా చక్కబెడు తూనే వున్నాడు.

—ఆరోజు సాయంత్రం :

పాడిదూడలు, లేగదూడలూ గరువుపైన మేస్తున్నాయి. ఎడ్లన్నీ గరువుకి తూర్పువేపున్న పొలంలో దమ్ము చేస్తున్నాయి. దమ్ము పూర్తయిన పడమటి పొలంలో యాభైమంది ఆడకూలీలు నడుంవంచి వరినారు నాటుపోస్తున్నారు. గరువుమీద మేస్తున్న పశువుల మధ్య రాజ్యంపోయిన 'రారాజు'లా వడిమళ్ళిపోయిన ముసలెద్దు దిక్కులు చూస్తోంది. కూలీల మధ్య వరినారు పోగుల్ని అందిస్తూ భూమిలేని కామందులా తల నెరిసిన నర్శిగాడున్నాడు.

చల్లపాటివేళ ఊడుపు ఎంతవరకు లొంగుబాటుకు వచ్చిందో చూసి పోదామని రాఘవయ్య గరువుమీది కొచ్చేడు. రాఘవయ్యని అల్లంత

ధ్యారాన గమనించి మిగిలిన కూలీలకి పనులు పురమాయించి కాళ్లా చేతులూ కడుక్కొని పాకదగ్గరకొచ్చి నర్శిగాడు మడత మంచం వాల్చాడు.

మల్లుపంచె నగలకుండా సిల్కు జుబ్బా మడతపడకుండా అప్పుడే విరిసిన మల్లెమొగ్గలా మంచం మధ్యగా కూర్చున్నాడు రాఘవయ్య.

తోలు పెట్టెలోంచి చుట్టతీసి అప్పటిదాకా నీళ్ళలో నానివున్న నర్శిగాడికి విసిరేడు. మరోచుట్టతీసి సున్నితంగా కొనకొరికి తనూ చుట్ట ముట్టించుకొన్నాడు. ఆ అగ్గిపుల్లనే నర్శిగాడు అందుకొని వేళ్ళు కాలే లోపునే తనూ చుట్ట వెలిగించి రాఘవయ్య ముందు 'కాళ్ళదగ్గర గడ్డి పరుచుకొని కూర్చున్నాడు' నర్శిగాడు.

రాఘవయ్య చుట్టూ కలియజూశాడు.

"ఆ పెద్దెద్దుని దమ్ములోకి దిగ్గొటలేదేరా?" అన్నాడు.

"దమ్ములు మొదలైన కాణ్నించి అది అరక మెడపైన పెడితే నాలుగడుగులేసి తొంగొంటంది బాబూ! పని కద్దని సెప్పి పాడిదూడల్లోకి తోలేసేను" అన్నాడు నర్శిగాడు.

"బాగానే వుందిరా వరస. పన్చెయ్యాల్సినప్పుడు పాడిదూడల్లోనూ దాణా తినేటప్పుడు ఎడ్లలోకి వెళతది కాబోలు" రాఘవయ్య అన్నాడు.

"అది మన ఇంట పుట్టిన గిత్తేకద బాబయ్యా! ఇప్పటిదాకా ఎంత సేను దున్నిందో ఎంత దమ్ముచేసిందో వడిమళ్ళిపోబట్టి ఓపికలేక తొంగొంటంది కానీ......"

"అలానుకొంటే అన్ని దూడలకీ వడిమళ్ళుద్ది. అన్ని గిత్తలూ ఇలాగే తయారౌతాయ్. అప్పుడు వీటిని మేపడానికే ఈ కమతం చాలదు. మన సుబ్బడికి చెప్పి రేపు శనివారం సంతకి తోలెయ్."

"సంతకి తోలితే దీన్నెవడు కొంటాడు బాబూ! కసాయోడు కొనాలి గానీ......"

6)

"మనకి పనికి రానప్పుడు ఎవరుకొంటే మనకేరా? మేత దండగ
తగ్గుద్ది."

"అదేవన్నమాట బాబూ! అదీ గరువుమీద పుట్టి ఈ గరువుమీద
పెరిగిన దూడ. తిరిగినన్నాళ్ళు తిరిగేక ఇక్కడే ఓతట్టెడు ఉప్పుపోసి
మట్టిలో కలిపేత్తే సరిపోతది" అన్నాడు నర్శిగాడు.

రాఘవయ్య చికాకుపడ్డాడు.

"అప్పటిదాకా మేపొద్దొటరా, పని సెయ్యని దూడ నెంతకాల
మని మేపుతావ్! వయసు మీరితే మడుసుల్నే గవర్నమెంటు ఉద్యోగం
లోంచి తీసేస్తది. అట్టాంటిది పశువుల్నెందుకురా చచ్చేదాకా మేపడం?"
అన్నాడు.

"మనిషికైతే సంసారం పిల్లలూ, నా అన్నవారు ఎవరో
వుంటారు సూడ్డానికి, దానికెవరున్నారు బాబూ మనం తప్ప." నర్శిగాడి
మాటలకి రాఘవయ్య నవ్వేడు.

"మరి నీ కెవరున్నార్రా?" అని అడిగేడు.

క్షణకాలం నర్శిగాడికి సమాధానం దొరకలేదు.

నెత్తిపైన ఎవరో గట్టిగా **మోదినట్టయింది**. కటిక చీకటిలోకి తనని
మూటకట్టి విసిరేసినట్టయింది.

ఆ చీకట్లో ఎక్కడో దిక్కులేని అనాధలా తను రాలిపోతున్నట్టని
పించింది. తలెత్తి యజమాని మొహంలోకి భీతిగా చూసేడు. రాఘవయ్య
లేచి నించున్నాడు.

"కూలీల మస్తరు చూసి ఎంత కూలీ ఇవ్వాలో రాత్రి కింటికొచ్చి
సెప్పు. రాత్రికి నీ కిక్కడికి ముంతరాదు. ఇంట దగ్గరే తినేద్దువుగానీ
రా!" అన్చెప్పి వెళ్ళిపోయాడు రాఘవయ్య.

నర్శిగాడి కింతకాలం ఆ కమతంలో చేస్తున్న చాకిరీకి మూడు
పూట్ల తిండి, ఓ ముతక పంచె, బనీను, గడిపరుపు, గొంగళీ ప్రతి
ఫలం. చాకిరీ చేస్తున్నంతకాలం ఇవి వుంటయ్! అన్న నమ్మకం వుంది.

'కానీ...చాకిరీ చేసే ఓపిక లేకపో...! ! !'

ఆ ఆలోచన రాగానే మెదడు మధ్యలో పిడుగు పడ్డట్టనిపించింది.

చాకిరీచేసే ఓపికలేని ముసలెద్దుని కనీసం కసాయివాడయినా కొంటాడు. చర్మం తీసుకొని ఎముకలు, మాంసం విసిరేస్తాడు.

కానీ చాకిరీ చెయ్యలేని మనిషి నెవడు కొంటాడు ?

ఇన్నాళ్లూ తనని వెంటాడిన ప్రాణభయంకంటె కొత్తభయం... భయంకరమైన భయం నర్సిగాడి వెన్నులోంచి కొట్టుకొచ్చింది. అప్పుడా సమయంలో వాడు గజగజ వణకిపోయాడు.

ఎదురుగా నిశ్చింతగా మేస్తోన్న ముసలెద్దు కనబడింది.

"నీ కాలోచించే శక్తి లేదు. మనిషిలాగే నీకూ ఆలోచించేశక్తి వుంటే ఈ స్థితిలో నిన్ను కసాయివాడి కమ్ముతానన్న రాఘవయ్య నేం చేసేదానవో? కనీసం నీకు కొమ్ములున్నాయనైనా గుర్తుకొచ్చేదేమో ? నాకాలోచించే శక్తి వుంది. కానీ...ధైర్యం..."

నర్సిగాడు నవ్వుకొన్నాడు.

"అదే వుంటే మిలట్రీనించి ఎందుకు పారిపోయొస్తాను" అని అప్పుడు ధైర్యం లేకపోవచ్చు. కానీ యిప్పుడు...?